సాక్షి
వికారాబాద్
బుధవారం, 10, మే, 2023



గాలివాన బీభత్సం
కొత్లాపూర్‌లో గాలివాన బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. 8లో▸



కల్వుర్తిలో హోరాహోరీ
కల్బుర్గిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటాపోటీ నెలకొంది. 8లో▸



అనుసరణీయం
అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే ఆనంద్, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్ మేళా

వికారాబాద్ అర్బన్: జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వికారాబాద్‌లో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. డీ మార్ట్, బాటా, స్విగ్గీ తదితర కంపెనీల్లో సుమారు వంద మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి లేదా డిగ్రీ అర్హత ఉండి ఆసక్తి ఉన్న నిరుద్యోగులు పాల్గొనాలని ఆయన సూచించారు. వివరాల కోసం 9676047444 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు



వెబ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, అధికారులు

వికారాబాద్ అర్బన్: వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వికారాబాద్ ఆర్డీఓ విజయ కుమారి అన్నారు. నిరాదరణకు గురవుతున్న వృద్ధులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చని సూచించారు. వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో 'మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ చైర్‌పర్సన్ పోస్టర్'ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'సీనియర్ సిటిజెన్స్ మెయింటెనెన్స్ కేసెస్ అండ్ మానిటరింగ్ సిస్టం' వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసుకునే ఉందన్నారు. స్మార్ట్ ఫోన్లు, ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుందన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్: 14567లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి లలిత కుమారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పర్యవేక్షణ బాధ్యత సర్పంచ్‌లదే



నీటూరులో పర్యటిస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్

దౌల్తాబాద్: పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని నీటూరు, సర్సాపూర్ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. నీటూరులో వాటర్ ట్యాంకు చుట్టూ నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌కు సూచించారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉన్నారని, సర్పంచులు బాధ్యత తీసుకుని పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలని కోరారు. బిచ్చాల గ్రామంలో సర్పంచ్ తండ్రి నాగేందర్‌సింగ్ గ్రామకంఠం భూమిని ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆయనపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎల్‌పీఓ వెంట ఎంపీఓ రవీందర్ తదితరులు ఉన్నారు.

'దళిత బంధు' వెలుగులు

- షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక అధికారి ఆనంద్
- పథకం లబ్ధిదారుల జీవన స్థితిగతుల పరిశీలన



దళిత బంధు లబ్ధిదారులను కలిసిన ప్రత్యేక అధికారి ఆనంద్

వికారాబాద్ అర్బన్: జిల్లాలో దళితబంధు పొందిన కుటుంబాల జీవన విధానం ఎంతో మెరుగుపడిందని షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ ప్రత్యేక అధికారి బి.ఆనంద్ కుమార్ అన్నారు. పథకం కింద లబ్ధి పొందిన పలు కుటుంబాలను మంగళవారం జిల్లా అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. స్కీమ్ తీసుకున్న వారు ఆర్థిక పురోగతి సాధించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో 358 కుటుంబాలకు వివిధ రంగాల్లో పథకం వర్తింపజేశారన్నారు. ఇందు కోసం ప్రభుత్వం నుంచి రూ.35.80 కోట్లు వచ్చాయని వివరించారు. లబ్ధిదారులు తీసుకున్న యూనిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాబుమోజెస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు మారలే!

- ఉసూరుమనిపించిన జిల్లా విద్యార్థులు
- ఫస్టియర్, సెకండియర్ చివరి వరుసలోనే
- ఉత్తీర్ణులైన వారిలో బాలికలే అధికం
- గతేడాది సైతం ఇవే తరహా రిజల్ట్స్
- దృష్టిసారించని బోర్డు అధికారులు, పాలకులు

ప్రథమ సంవత్సరం:	32వ స్థానం
ద్వితీయ సంవత్సరం:	28



ఆశ్రిత్‌రెడ్డి, ఎంపీసీ 467/470



చౌట కృష్ణ, సీఈసీ 944/1000



చట్నీ అర్చన, బీపీసీ 910/1000



శ్రావణి, ఎంపీసీ 905/1000

వికారాబాద్: ఇంటర్ ఫలితాలు మన జిల్లాను చివరి బెంచీకే పరిమితం చేశాయి. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి మంగళవారం విడుదల చేసిన రిజల్ట్స్‌లో మన విద్యార్థులు వెనకబడ్డారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఇదే పరిస్థితి కనిపించింది. 33 జిల్లాలున్న రాష్ట్రంలో ఫస్టియర్‌లో 32వ స్థానం, సెకండియర్‌లో 28వ స్థానంలో నిలిచారు. గతేడాది కూడా ఇలాంటి ఫలితాలే రావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తీర్ణత పొందిన వారిలో బాలికలు పైచేయి సాధించారు.

ఫస్టియర్ 46శాతం

- ఇంటర్ ఫస్టియర్‌లో మొత్తం 7,859 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 3,618 మంది ఉత్తీర్ణులయ్యారు.
- 46శాతం రిజల్ట్ నమోదైంది.
- 3,897 మంది బాలురు పరీక్షలకు హాజరవగా 1,450 మాత్రమే పాసయ్యారు.
- ఉత్తీర్ణత శాతం 37గా నమోదైంది.
- బాలికలకు సంబంధించి 3,962 మందికి గాను 2,168 మంది పాసవగా.. 54 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సెకండియర్ 60శాతం

- ఇంటర్ సెకండియర్‌లో మొత్తం 6,459 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. ఇందులో 3,909 మంది పాసయ్యారు.
- ఉత్తీర్ణత శాతం 60గా నమోదైంది.
- ఇందులో 2,935 మంది బాలురు ఉండగా.. వీరిలో 1,564 పాసయ్యారు.
- ఉత్తీర్ణత శాతం 53గా నమోదైంది.
- 3,524 మంది బాలికలకు గాను 2,345 మంది పాసయ్యారు.
- ఉత్తీర్ణత శాతం 66గా నమోదైంది.
- ఒకేషనల్ కోర్సు ఫస్టియర్‌కు సంబంధించి 1,374 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 742 మంది పాసయ్యారు.
- 54 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- ఒకేషనల్ సెకండియర్‌కు సంబంధించి 1,149 మంది పరీక్షలకు హాజరవగా 873 మంది ఉత్తీర్ణులయ్యారు.
- పాస్ పర్సెంటేజీ 75గా రికార్డయ్యింది వచ్చింది.

పర్యవేక్షణా లోపం

ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు వెనకబడటంలో అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నోడల్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో వికారాబాద్ కళాశాల ప్రిన్సిపల్‌కు బాధ్యతలు అప్పగించారు. బోర్డు అధికారులు ఏనాడూ కళాశాలలను సందర్శించిన పాపాన పోలేదు. ఇప్పటికైనా పూర్తి స్థాయి నోడల్ అధికారిని నియమించడంతో పాటు ఇంటర్ ఫలితాల మెరుగునకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని కోరుతున్నారు.

మోడల్ స్కూల్‌లో టాపర్లు..

బంట్వారం: బంట్వారం మోడల్ స్కూల్ విద్యార్థి చౌట కృష్ణ ద్వితీయ సంవత్సరం సీఈసీలో 944 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. ఇదే కళాశాలకు చెందిన చట్నీ అర్చన బీపీసీ ద్వితీయ 910, బెల్కటూరి శ్రావణి ఎంపీసీ ద్వితీయ 905 మార్కులతో, ఊరడి ఉమారాణి సీఈసీ మొదటి సంవత్సరం 433 మార్కులతో సత్తాచాటారని ప్రిన్సిపల్ సరళారెడ్డి తెలిపారు.

గురుకులంలో వందశాతం

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (మోమిన్‌పేట) విద్యార్థులు మొదటి సంవత్సరంలో వంద శాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ అనిత తెలిపారు. 25 మంది పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారని పేర్కొన్నారు.



ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 460 మార్కులు సాధించిన వైష్ణవితో తల్లిదండ్రులు

సత్తాచాటిన వైష్ణవి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థిని సామల వైష్ణవి 470 మార్కులకు గాను 460 మార్కులు సాధించింది. ఈమె స్వగ్రామం కోట్‌పల్లి మండలం నాగ్‌సాన్‌పల్లి. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ కూతురు అత్యుత్తమ మార్కులు సాధించడంపై తల్లిదండ్రులు మహిపాల్ రెడ్డి, గౌరమ్మ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

టాప్ లేపిన ఆశ్రిత్‌రెడ్డి

దోమ: మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లికి చెందిన ఎన్నేపల్లి ఆశ్రిత్‌రెడ్డి రాష్ట్ర స్థాయి రెండో ర్యాంక్ సాధించాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో ఎంపీసీ ఫస్టియర్ చదివిన ఆయన 470కి గాను 467 మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు రామచంద్రారెడ్డి, స్వర్ణలతతో పాటు గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

మరింత మెరుగుపడాలి

గతంతో పోలిస్తే ఫలితాల శాతం పెరిగింది.. కానీ మిగతా జిల్లాలతో పోలిస్తే ర్యాంకింగ్ మరింత మెరుగుపడాల్సి ఉంది. పాఠశాల స్థాయి నుంచి వచ్చే విద్యార్థుల సామర్థ్యాల్లో నాణ్యత లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఎదురవుతోంది. ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన బోధన అందించాల్సి ఉంది. లేదంటే పరిస్థితిలో మార్పు రావడం కష్టమే. అయినప్పటికీ ఫస్టియర్‌లో కొంత ఇబ్బంది ఏర్పడినా.. సెకండ్ ఇయర్ వచ్చేసరికి మంచి ఫలితాలు రాబట్టేలా చూస్తున్నాం.

– శంకర్, ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి

పకడ్బందీగా కొనుగోళ్లు



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- సెంటర్ల వద్ద అన్ని వసతులు కల్పించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- ఉపాధి, మనబడి, గొర్రెల పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్

వికారాబాద్ అర్బన్: వరి ధాన్యం సేకరణను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ, రెండో విడత గొర్రెల పంపిణీ, జీపీ భవనాల నిర్మాణం, మన ఊరు మనబడి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు సెంటర్ల వద్ద అన్ని వసతులు కల్పించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకుని తాడిపత్రిలు, గోనె సంచులు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు.

స్థలాలు ఇవ్వండి

జిల్లాలో 36 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 16 సెంటర్లను గుర్తించి పనులు చేపట్టామని తెలిపారు. 20 ఉప కేంద్రాలకు స్థలాలను గుర్తించి బుధవారం సాయంత్రంలోపు పంచాయతీరాజ్ ఈఈలకు అప్పగించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు.

క్రీడలకు ఏర్పాట్లు చేయండి

ముఖ్యమంత్రి కప్– 2023 సందర్భంగా ఆరోగ్యకరమైన వాతావరణంలో క్రీడలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతీ గ్రామం నుంచి యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సర్పంచ్‌లతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి క్రీడలు నిర్వహించాలని సూచించారు.

మనబడి పనులు పూర్తిచేయండి

మన ఊరు మనబడి కింద చేపట్టిన పనులు, పంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు ఎంపీడీఓలు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచకపోతే టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ అశోక్ కుమార్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఈఓ రేణుకా దేవి, డీపీఓ తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎం చొరవతోనే..

కొడంగల్: మండల పరిధిలోని అంగడిరాయిచూర్, చిట్లపల్లి, చిన్ననందిగామ గ్రామాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం పీఏసీఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ధాన్యం తడిసినా కొనుగోలు చేస్తామని, చివరి గింజ వరకు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.2,060,బీ గ్రేడ్‌కు రూ.2,040 చొప్పున మద్దతు ధర అందజేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో పల్లెల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యాయని, రైతులందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులు, వ్యాపారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, కౌన్సిలర్ మధుయాదవ్, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీ, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సర్పంచులు సావిత్రి, అంజద్, గోవింద్, బీఆర్ఎస్ నాయకులు రామూనాయక్, యాదగిరి, మహేందర్ రెడ్డి, బాకారం అరుణ్, చిన్న నందిగామ సాయిలు, రాంరెడ్డి పాల్గొన్నారు.



కొడంగల్‌లో ధాన్యం సేకరణ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌ను వీడుతున్న శ్రేణులు

- ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరిన ఇద్దరు సర్పంచ్‌లు
- ప్రత్యామ్నాయం వైపు మరికొందరి అడుగులు
- పార్టీ మండల బాధ్యులపై అసంతృప్తే కారణం



నవాబుపేట: కాంగ్రెస్ మండల నాయకత్వంపై ఉన్న అసంతృప్తితో పలువురు సర్పంచులు, మండల స్థాయి సీనియర్ నాయకులు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ఎంతో కాలంగా కాంగ్రెస్ జెండా మోస్తున్న తమను పట్టించుకోకపోవడంతో పాటు ఏకపక్ష నిర్ణయాలతో నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. గుర్తింపు లేని చోట ఉండకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు పలువురు నాయకులు తెలిపారు. త్వరలోనే పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి, ప్రత్యామ్నాయం చూసుకుంటామని చెబుతున్నారు.

బీఆర్ఎస్ గూటికి ఇద్దరు సర్పంచ్‌లు

మండలంలోని 32 పంచాయతీలకు గాను కేవలం ఐదు జీపీల్లో మాత్రమే కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. పార్టీలోని కొందరు నాయకుల తీరు నచ్చక విసుగు చెందిన చిట్టిగిద్ద సర్పంచ్ శ్రీలతసుధాకర్‌రెడ్డి, అక్నాపూర్ సర్పంచ్ తలారీ అజయ్‌కుమార్ ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం మరో ఇద్దరు సర్పంచ్‌లు సైతం జెండా ఎత్తేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆర్కతల సర్పంచ్ వడ్డె రాములుతో పాటు మరో సర్పంచ్, కొంతమంది సీనియర్ నాయకులు పార్టీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని తెలుస్తోంది. ఈ విషయమై ఆర్కతల సర్పంచ్ వడ్డె రాములును సంప్రదించగా.. పార్టీ మండల అధ్యక్షుడు, కొంత మంది నాయకులు వ్యవహారం కేడర్‌కు నచ్చడం లేదన్నారు. ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులకు కనీస గౌరవం దక్కడం లేదని అసహనం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పార్టీ మారేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

పోరాట యోధుడు రాణాప్రతాప్



మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నా
- ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: పట్టణ శివారులోని ఖాంజాపూర్ గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాణా ప్రతాప్ సింగ్ వీరత్వం గురించి తెలియని వారు లేరన్నారు. ఆయన పోరాట పటిమ ప్రపంచం నలుమూలలా మార్మోగిందని తెలిపారు. తాండూరు రాజ్‌పుత్ సంఘం వారు గత పాలకులకు రాణాప్రతాప్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఆ యోధుని విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాజ్‌పుత్ సంఘానికి ఎకరా స్థలం కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని స్పష్టంచేశారు. తాండూరులో అడుగు పెట్టే వారికి మొదటగా రాణాప్రతాప్ సింగ్ దర్శనం కలుగుతుందని తెలిపారు. రాజ్‌పుత్ సంఘ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, కౌన్సిలర్లు సంగీతా ఠాకూర్, వెంకన్న, విజయాదేవి, రాజ్‌పుత్ సంఘం తాండూరు అధ్యక్షుడు మహేశ్ ఠాకూర్, గౌరవ అధ్యక్షుడు సుభాష్ సింగ్ ఠాకూర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ సింగ్, ప్రధాన కార్యదర్శి శివానంద్ సింగ్ ఠాకూర్, మాజీ అధ్యక్షుడు సూరజ్ సింగ్ ఠాకూర్, కమిటీ సభ్యులు దీపక్ సింగ్ ఠాకూర్, బాలాజీసింగ్, రమేశ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో శిక్షణ ఇవ్వాలి

- అధిక దిగుబడి సాధించేలా చూడాలి
- వ్యవసాయ శాఖ అధికారులకు ట్రైనీ కలెక్టర్ సూచన
- ధారూరు క్లస్టర్ రైతులతో సమావేశం

ధారూరు: అన్ని రకాల పంటలు అధిక దిగుబడినిచ్చేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ అధికారులపై ఉందని, ఇందుకోసం రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ట్రైనీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. ధారూరు వ్యవసాయ క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో మంగళవారం ఆయన కర్షకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు వేదికలో జరిగే సమావేశాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పంటల సాగు విధానాలను వివరించాలని, రైతులు కూడా వ్యవసాయ సూచనలను పాటించి, అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి పంట సాగులో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఎరువులు, విత్తనాలు సరఫరా చేసే విధానంపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అవుసుపల్లి గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రాజేశ్వర్‌రెడ్డి, ఏడీఏలు స్వరూప, వినోద్‌కుమార్‌ల, ఏఓ జ్యోతి, ఏఈఓ సంజూరాథోడ్, సర్పంచు చంద్రమౌళి, రైతుబంధు గ్రామ కో ఆర్డినేటర్ చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.



అడుగడుగునా ఘన స్వాగతం



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క, చిత్రంలో గద్దర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు

- ఉత్సాహంగా సాగిన భట్టి పాదయాత్ర

మీర్‌పేట: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ 54వ రోజు పాదయాత్ర మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ నుంచి మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ముందుగా జిల్లెలగూడ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర మొదలుపెట్టారు. యాత్ర జిల్లెలగూడ లలితానగర్ చౌరస్తా వద్దకు చేరుకోగానే భట్టివిక్రమార్క, ప్రజా గాయకుడు గద్దర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి కార్యకర్తలు భారీ గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్ర మీర్‌పేట చౌరస్తా మీదుగా బడంగ్‌పేటకు చేరుకుంది. ప్రజా గాయకుడు గద్దర్ మాట.. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. యాత్రలో నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిగురింత పారిజాత, కార్పొరేటర్లు చల్లా కవిత, సిద్దాల మౌనిక, మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణ, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, జి.రవిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం తగదు

తాండూరు రూరల్: గ్రామాల్లోని నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యం తగదని డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్ అన్నారు. మండల పరిధిలోని కొత్లాపూర్, ఐనెల్లిలోని నర్సరీలను మంగళవారం ఆయన పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రసాయన మందులు వేసి ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే నెల ప్రారంభంకానున్న హరితహారానికి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సిద్ధం కావాలన్నారు. ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, ఏపీఓ నరోత్తంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిష్టప్ప ఉన్నారు.



కొత్లాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్

క్లుప్తంగా

విద్యుత్ వైరు తెగి..

ఆవు, దూడ మృతి



మృతి చెందిన ఆవు, దూడ

పెద్దేముల్: పొలం గట్టుపై మేస్తున్న ఆవు, దూడపై విద్యుత్ వైరు తెగిపడటంతో అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ ఘటన పెద్దేముల్ మండలం జైరాంతండా(తట్టెపల్లి)లో చోటుచేసుకుంది. కిషన్ రాథోడ్‌కు చెందిన దూడ, బనావత్ అమర్‌సింగ్‌కు చెందిన ఆవు పొలం గట్టుపై మేస్తుండగా విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలిసిన స్థానికులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటాయని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వేలాడుతున్న విద్యుత్ వైర్లు సరిచేయాలని విద్యుత్ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



అలీమొద్దీన్ (ఫైల్)

బంట్వారం: మానసిక స్థితి సరిగాలేక పురుగు మందుతాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కోట్‌పల్లి మండల కేంద్రంలో చోటు చేసకుంది. ఏఎస్ఐ అంబదాసు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలం రాంపూర్‌కు చెందిన అలీమొద్దీన్ (51) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించే వాడు. చేతికొచ్చిన కొడుకు ఎనిమిది నెలల కిందట గుండె పోటుతో మృతిచెందాడు. దీంతో అప్పటినుంచి అలీమొద్దీన్ మానసికంగా కుండిపోయాడు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు అంతటా వెతికారు. ఆచూకి లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు స్థానిక పీహెచ్‌సీ వద్ద అలీమొద్దీన్ శవం లభ్యం కావడంతో కుటుంబీకులకు సమాచారం అందజేశారు. కోట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనకాల పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అంబాదాసు తెలిపారు.

39 మంది బైండోవర్

రూ.10.5 లక్షల నగదు పట్టివేత



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతగిరి: కర్నాటక రాష్ట్రం ఎన్నికల దృష్ట్యా 39మందిని బైండోవర్ చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. సరిహద్దు ప్రాంతాలైన కొత్లాపూర్, మైల్వార్, ఇంద్రాచెడ్, నవాంధ్గి, రావులపల్లి, చంద్రకల్‌లో ఆరు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 39మందిని బైండోవర్ చేయగా, ఏడుగురు నేరస్తులను పట్టుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా తరలిస్తున్న రూ.10.5లక్షల నగదును పట్టుకున్నామన్నారు. 544 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు.

37 మంది కానిస్టేబుళ్ల బదిలీ

సాధారణ బదిలీలలో భాగంగా మంగళవారం జిల్లాలోని 37మంది కానిస్టేబుళ్లను ఎస్పీ బదిలీ చేశారు. తన కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

వికసించిన మే పుష్పం



ఓ ఇంటి ఆవరణలో వికసించిన మే పుష్పం

ధారూరు: మండల కేంద్రంలోని ఓ ఇంటి పెరట్లో మంగళవారం మే పుష్పం వికసించింది. మహ్మద్ బాబాఖాన్ ఇంట్లో పూసిన మే పుష్పం చూపరులకు కనువిందు చేసింది. మే నెలలోనే ఈ పుష్పం వికసించడం దీని ప్రత్యేకత.

గాలివాన బీభత్సం

- కోత్లాపూర్‌లో నేలకొరిగిన చెట్లు
- ఇంటిపై పడిన విద్యుత్‌స్తంభాలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్‌లో గాలివాన బీభత్సం సృష్టించింది. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గ్రామంలోని తుల్జప్ప ఇంటిపై, స్కూల్ ఆవరణలో చెట్లు కూలాయి. అలాగే గ్రామంలో ఎనిమిది విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. తాండూరు–చించోళి ప్రధాన రోడ్డు మార్గంలోని రేణుక ఎల్లమ్మ కమాన్ వద్ద భారీ వృక్షం, విద్యుత్‌స్తంభం కూలడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం...

కోత్లాపూర్‌లో పాతబడిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేయాలని అనేకసార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామ సర్పంచ్ సాయిలు అన్నారు. గాలివానకు విద్యుత్ స్తంభాలతో పాటు వృక్షాలు నేలకూలాయన్నారు. కొన్ని ఇళ్లపై, రోడ్లపై పడ్డాయన్నారు. ప్రాణనష్టం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి గ్రామంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు.



తాండూరు రూరల్: కోత్లాపూర్‌లో ఈదురుగాలులకు రోడ్డుపై పడిన వృక్షం

ధారూరులో..

ధారూరు: మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వాన కురిసింది. ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ఉక్కపోత నెలకొంది. రాత్రయినా విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



కోత్లాపూర్‌లో ఓ ఇంటిపై పడిన విద్యుత్ స్తంభం

సుప్రీంకు వెళ్లి కాపాడుకుంటాం

పంచాయతీ జూనియర్ కార్యదర్శులకు అండగా ఉంటాం: చంద్రశేఖర్

వికారాబాద్ అర్బన్: పంచాయతీ జూనియర్ కార్యదర్శులకు బీజేపీ అండగా ఉంటుందని.. రాష్ట్ర ప్రభుత్వం వారిని తొలగిస్తే సుప్రీంకోర్టు వెళ్లి కాపాడుకుంటామని ఆ పార్టీ నేత ఎ.చంద్రశేఖర్ అన్నారు. విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించడంతో జిల్లాలోని 409 మంది పంచాయతీ కార్యదర్శులు మంగళవారం వికారాబాద్‌లో సమావేశమయ్యారు. వీరికి బీజేపీ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాల్లో చేరిన కార్యదర్శులను ప్రభుత్వానికి తొలగించే అధికారం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం జేపీఎస్‌లతో వెట్టి చాకిరి చేయించుకుంటోందన్నారు. వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులకు నేటి నుంచి మధ్యాహ్న భోజనం అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తే చర్యలు

తహసీల్దార్ కిరణ్‌కుమార్

- జేసీబీలకు రూ.5వేలు, టిప్పర్లకు రూ.10వేల చొప్పున జరిమానా

మోమిన్‌పేట: నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఎల్లమ్మగడ్డ తండా సమీపంలోని ప్రభుత్వ భూమిలో సోమవారం రాత్రి మట్టిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ఐ విజయ్‌ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేసి రెండు జేసీలు, రెండ్లు టిప్పర్లను స్టేషన్‌కు తరలించారు. మంగళవారం తహసీల్దార్‌కు అప్పగించారు. వినయ్‌కుమార్, ఇబ్రహీంలకు చెందిన జేసీబీలకు రూ.5వేల చొప్పున, తహీర్, సైదిరెడ్డికి చెందిన టిప్పర్లకు రూ.10వేల జరిమానా విధించామన్నారు. మొదటిసారి కావడంతో జరిమానా విధించామన్నారు. మరోసారి ఇటువంటి చర్యలు పునరావృతమైతే వాహనాలను సీజ్ చేయడంతో పాటుగా రెట్టింపు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



మోమిన్‌పేటలో పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన టిప్పర్లు

ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా మారాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో బాధితులు, లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో చేపట్టిన పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ అమలు చేయడం లేదన్నారు. దేశమంతా తెలంగాణవైపు చూస్తోందన్నారు. పేదలకోసం పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు అండగా నిలివాలని పిలుపునిచ్చారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు గౌరవంతో బ్రతకాలని పింఛన్లు మంజూరు చేయిస్తున్నారని చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్‌లు బల్వంత్ రెడ్డి, విజయలక్ష్మి, విమల, స్వరూప, పర్మయ్య, నర్సింలు, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, రంగారెడ్డి, ఆనంద్ రెడ్డి, శాంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు

కుల్కచర్ల: పంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు కాంగ్రెస్ పార్టీ, పీఎస్‌పీఎస్ సంఘం మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రజల ఆరోగ్య సంరక్షణకై నిర్విరామంగా కృషిచేసేది పంచాయతీ కార్మికులు మాత్రమే అన్నారు. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేవరకు వారి పోరాటానికి తమ మద్దతుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజనేయులు, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్ కుమార్, మాజీ సర్పంచ్ జానకీరాం, తపస్ జిల్లా నాయకులు బుచ్చిలింగం, నాయకులు కృష్ణయ్య, యాదయ్య, జలీల్, పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మెకు మద్దతు తెలుతున్న భీంరెడ్డి, నాయకులు

పంచాయతీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ మద్దతు

- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

హైఓల్టేజీతో కాలిపోయిన గృహోపకరణాలు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనంటున్న స్థానికులు

తాండూరు టౌన్ : హై ఓల్టేజీతో తాండూరు పట్టణంలోని శాంతప్ప కాలనీలో గృహోపకరణాలు కాలిపోయాయి. సోమవారం రాత్రి అకస్మాతుగా విద్యుత్ హై ఓల్టేజీ రావడంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో పాటు ఇళ్లలోని ఫ్యాన్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, కూలర్లు, ల్యాప్‌టాప్‌లు కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పట్టణ విద్యుత్ ఏఈ రఘు కాలనీకి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పలుమార్లు లోఓల్టేజీ, హై ఓల్టేజీ వస్తుండటంతో లైన్‌మెన్‌కు విషయం చెప్పినా పట్టించుకోలేదని కాలనీవాసులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు వచ్చి ఒక్కసారిగా గృహోపకరణాలు పాడైపోయాయన్నారు.



ఓఇంటిలో పాడైపోయిన కూలర్, వాషింగ్ మెషీన్

'ఇంటర్‌సిటీ'ని సద్వినియోగం చేసుకోండి

మర్పల్లి: ఇంటర్ సిటీ రైలు సర్వీస్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఇంటర్ సిటీ రైలు హైదరాబాద్ వెళ్లేందుకు మర్పల్లి రైల్వే స్టేషన్‌లో ఉదయం 7.30 గంటలకు హాల్ట్ అయ్యింది. దీంతో విశ్వేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌లు మండల బీజేపీ నాయకులతో కలిసి రైలు ఆగగానే రైలు బోగి ముందు కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్న సమయంలో ఇంటర్ సిటీ సాధన కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతి నిధులు, మండల ప్రజలు మర్పల్లి రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ ఆగేవిధంగా చూడాలని వినతి పత్రం ఇచ్చారని అన్నారు. దీంతో తాను అప్పటి రైల్వేశాఖ మంత్రికి, దక్షిణ మధ్య రైల్వే శాఖ మేనేజర్‌కు వినతి పత్రాలు ఇచ్చానన్నారు. పార్లమెంట్‌లో సైతం మర్పల్లిలో ఇంటర్ సిటీ రైలు ఆపాలంటూ, ఎంఎంటీఎస్ శంకర్‌పల్లి, వికారాబాద్‌లో ఆపాలని, వికారాబాద్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి నిధులు కేటాయించాలని ప్రశ్నించినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా చెల్లించక పోవడంతో రైల్వేబ్రిడ్జి పనులు జరగడం లేదన్నారు. మొత్తానికి మండల ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. అనంతరం మర్పల్లి రైల్వే స్టేషన్‌లో రైలు టిక్కెట్లు కొనుగోలు చేసి వికారాబాద్ వరకు రైల్‌లో ప్రయాణం చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు ఉన్నారు.



ఇంటర్‌సిటీలో ప్రయాణిస్తున్న మాజీ ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్

ఎంపీ సహకారంతోనే..

మర్పల్లి: చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి సహకారంతోనే మర్పల్లిలో ఇంటర్ సిటీ రైళ్ల ఆపేందుకు అంగీకారం లభించిందని జెడ్పీటీసీ మధుకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బీదర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇంటర్ సిటీ ట్రైన్‌ను మంగళవారం మర్పల్లి స్టేషన్‌లో ఆపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు బీజేపీకి పోటీగా రంజిత్‌రెడ్డి ఫ్లెక్సీలను పట్టుకుని రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆగిన రైలు ముందు కొబ్బరి కాయలు కొట్టి పూల దండలు వేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా పాల్గొన్నారు.

కల్బుర్గిలో హోరాహోరీ

ఖర్గే ఇలాఖా కావడంతో సర్వత్రా ఆసక్తి

తాండూరు: కర్నాటక రాష్ట్రం సరిహద్దు జిల్లా అయిన కల్బుర్గిలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది. కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటాపోటీ నెలకొంది. గత ఎన్నికలో 9 స్థానాలకు గాను ఐదు కై వసం చేసుకున్న బీజేపీకి ఈసారి విజయం అంత సులువు కాదని ప్రచార సరళిని బట్టి తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఇలాఖా కావడంతో ఈ జిల్లాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సోమవారం ఎన్నికల ప్రచారం ముగియగా.. బుధవారం పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్, బీజేపీలు విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. కల్బుర్గి జిల్లాలో మొత్తం 9 అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 5 స్థానాలు బిజెపికి, నాలుగు కాంగ్రెస్‌కు దక్కాయి. ఈసారి రాజకీయం భిన్నంగా ఉంది. ఈ జిల్లాపై మల్లికార్జున్ ఖర్గే ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో జిల్లా అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఖర్గేను ఓడించిన ఎంపీ ఉమేశ్ జాదవ్ ప్రభావం అంతగా కనిపించడం లేదని చర్చ జరుగుతోంది. మరోవైపు ఖర్గే కుమారుడు, చితాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రియాంక్ ఖర్గే రెండోసారి బరిలో నిలిచారు. బీజేపీ అభ్యర్థి మణికంఠరాథోడ్ ప్రియాంక్ ఖర్గేకు దీటుగా ప్రచారం నిర్వహించారు. ఉత్తర కల్బుర్గి, దక్షిణ కల్బుర్గి, రూరల్ స్థానాలలో కాంగ్రెస్ పార్టీకి 2, బీజేపీకి ఒకటి స్థానాలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. జేవర్గి, చితాపూర్‌లలో కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్‌ల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. సెడంలో బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ తెల్కూర్‌కు కొంచెం సానుకూల వాతావరణం ఉందని చెబుతున్నారు.జేడీఎస్ అభ్యర్థి బాల్‌రాజ్ గుత్తేదార్ సైతం జోరుగా ప్రచారం చేస్తున్నారు. చించోళి సెగ్మెంట్‌లో 2018లో కాంగ్రెస్ అభ్యర్థి ఉమేశ్ జాదవ్ విజయం సాధించారు. తర్వాత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆ పార్టీకి రాజీనామా చేసి కల్బుర్గి బీజేపీ నుంచి బరిలోకి దిగి ఖర్గేపై విజయం సాధించారు. తర్వాత చించోళి అసెంబ్లీ ఉప ఎన్నికలో ఉమేశ్ జాదవ్ తనయుడు గెలుపొందారు. అయితే ఈసారి కాంగ్రెస్ పార్టీ సైతం బలం పుంజుకొని ఉమేష్ జాదవ్ కుమారుడిపై గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అఫ్జల్‌పూర్ సెగ్మెంట్‌లో బీజేపీ ప్రభావం కనిపిస్తోంది.



పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్టు

మర్పల్లి: వ్యవసాయ పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రూ.5,030 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య, బిడ్డలకు జాగ్రత్త అని చెప్పి.. అంతలోనే..

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యాచారం: భార్యను, ఇద్దరు పిల్లలను వాహనంలో ఎక్కించాడు.. జాగ్రత్తలు చెప్పాడు.. మీ వెనుకాలే వస్తున్నా అంటూ బైక్‌పై బయలుదేరాడు. అంతలోనే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.యాచారం మండల కేంద్రానికి చెందిన డి శివలింగం(35) మంగళవారం భార్య, పిల్లలతో కలిసి నగరంలో ఓ వివాహానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో రాత్రి వేళ భార్య పావనిని, ఇద్దరి కూతుళ్లను సాగర్ రింగు రోడ్డు వద్ద వేరే వాహనంలో ఎక్కించి వెనుకాలే బైక్‌పై యాచారం వైపు వస్తున్నాడు.గునుగల్ అటవీ ప్రాంతంలో రాత్రి 8 గంటల సమయంలో శివలింగం నడిపే బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివలింగం తలకు తీవ్ర గాయమైంది. అక్కడికక్కడే మృతి చెందాడు. జాగ్రత్త అని చెప్పి వెనుకనే వస్తున్న అని చెప్పి వెళ్లిపోయావా అంటూ భార్య రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. శివలింగం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగయ్య తెలిపారు.

గొర్రెల దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు, చిత్రంలో గొర్రెలు అపహరించిన దొంగలు

ఇబ్రహీంపట్నం రూరల్: గొర్రెలను, మేకలను అపహరిస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలను సీఐ రవికుమార్ వెల్లడించారు. వండర్‌లా సమీపంలోని కారులో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పారన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారన్నారు. షేక్ ఇక్బాల్ (26), షేక్ జాఫర్ (26),సయ్యద్ అమ్మద్(33), మహమ్మద్‌గౌస్(23), షేక్‌అమీర్(20)లు బాలాపూర్‌కు చెందిన వారన్నారు. ఆటో డ్రైవర్లుగా పని చేస్తుంటారని, రాత్రి వేళల్లో గొర్రెలను, మేకలను అపహరిస్తుంటారని చెప్పారు. అలాగే పార్కింగ్ చేసిన కార్లు, లారీల నుంచి డీజిల్ దొంగతనం చేస్తున్నారని తెలిపారు. ఆటవీ ప్రాంతాల్లో, గ్రామాల శివారులో గొర్రెలు, మేకల మందల వద్ద మాటువేసి వాటిని అపహరిస్తున్నట్లు చెప్పారు. సుమారు ఏడెనిమిది గొర్రెలను, మేకలను కారులో తీసుకెళ్లి విక్రయించే వారని, ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మేట్, పహాడీషరీఫ్, కందుకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు మార్లు దొంగతనాలకు పాల్పడినట్లు చెప్పారు.

48 గొర్రెలు, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం

దొంగల నుంచి 48 గొర్రెలు, మేకలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4.50 లక్షలు ఉంటుందని తెలిపారు. రూ.2.5 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఇండికా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

10 కేసుల్లో నిందితులు ...

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే అనేక మార్లు దొంగతనాలకు పాల్పడ్డారు. ఉప్పల్, ఆదిబట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, పహాడీషరీఫ్, కొత్తూర్ పోలీస్‌స్టేషన్లలో వీరిపై 10 కేసులయ్యాయి. ఐదుగురు నిందితుల్లో షేక్ అమీర్ పరారీలో ఉన్న ట్లు పోలీసులు తెలిపారు . నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వైభవంగా లింగమయ్య జాతర

బషీరాబాద్: మండల పరిధిలోని మంతట్టి గ్రామంలో లింగమయ్య జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడురోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు కాగ్నానది నుంచి తీసువచ్చిన గంగా జలాలతో లింగమయ్యను అభిషేకించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రథోత్సవం కన్నుల పండువగా కొనసాగింది. గ్రామ సర్పంచ్ దశరథ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



బోనాలతో మహిళల ప్రదక్షిణలు

మహారాణా ప్రతాప్‌సింగ్‌కు ఘన నివాళి

పరిగి: మాతృభూమి కొరకు ఎన్నో ఏళ్ల అడవిలో గడిపి పోరాడిన ధీరోదాత్తుడు మహారాణా ప్రతాప్ సింగ్ అని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ అన్నారు. మంగళవారం మహారాణా ప్రతాప్‌సింగ్ జయంతి సందర్భంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, నాయకులు అనిత్, హరియనాయక్, శివరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరాఠ యోధుడు..

కుల్కచర్ల: మహారాణా ప్రతాప్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని అంగడిబజార్‌లో రాణాప్రతాప్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు చంద్రలింగం, కర్ణయ్య తదితరులు మాట్లాడుతూ.. హిందూ వ్యవస్థ ఉన్నతికి పోరాడిన మరాఠ యోధుడు మహారాణా ప్రతాప్‌సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: నివాళులర్పిస్తున్న రాణాప్రతాప్ యువజన సంఘం నాయకులు